**తెలుగు కళాసమితి న్యూజెర్సీ 1988 విభవ ఉగాది మినీ కథల పోటీలో రు. 300 బహుమతి పొందిన కథ**

# జవాబులేని ప్రశ్న

—రామస్వామి



ఇంకా చాలా దూరం నడవాలి. కాళ్ళు లాగుతున్నాయి. మదుం మీద కూర్చున్నాడు.

ఒక కప్పు టీ గాని, నీళ్ళుగానీ తాగితే బాగుం డునుగావి కొట్లన్నీ మూసేసేరు. చీకటి మింగిన రాత్రి కాళసర్పంలా వుంది. పగలంతా పనిచేసి అలసిపోయిన శ్రమజీవులు రేపటి వుదయమిచ్చే మిధ్యా వాగ్దానాలని నెమరువేస్తూ హాయిగా నిద్ర పోతున్నారు. పాపం పిచ్చివాళ్ళు!

దూరంగా రోడ్డువైపు ఒక వెలుగు కనిపించింది. అది మెల్లమెల్లగా మదుం వైపే వస్తున్నట్లుంది. బహుశ ఏదైనా టీ బండేమో!

జేబు తడిమి చూసాడు. అది ఖాళీ. రెండు రోజులైంది. పది పైసలైనా సంపాదించలేదు.

కొత్తవలస సంతగదా, నాలుగు డబ్బులొస్తాయని బయలుదేరాడు మొన్న.

అదేం శనోగాని ఈ మధ్య రాబడి పూర్తిగా తగ్గిపోయింది. జనాల్లో ఏదో మార్పు కనిపిస్తోంది. పెద్ద హోటల్లో గది తీసికొని వుండే వాళ్ళ దగ్గరకెళ్ళి చెయ్యి చూపిస్తున్నారుగాని తనలా స్టేషన్ దగ్గరగాని, మార్కెట్టు దగ్గర కాని గుడ్డ పరచుకొని కూర్చున్న వాళ్ళదగ్గరకు రావటం లేదు. తన రాత అంతేనేమో! తన చేతి రాత కూడా తెలియని ఆ హస్త రేఖా శాస్త్రజ్ఞుడు నిట్టూర్చాడు!

తెల్లవారక ముందే బయలుదేరాడు. జనం రాక ముందే గుడ్డ పరచి కూర్చున్నాడు.

చల్లగా వీచిన గాలి వెచ్చదనం పుంజుకుంది. ఎండలో తిరగలేని పక్షులు చెట్టు నీడలో చేరాయి.

సంతలోకి ఎవరూ రాలేదు. జనం చేరలేదు. సరకులూ రాలేదు. ఆశ్చర్యం వేసి రోడ్డు మీదకెళ్ళి చూసాడు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. బస్సులు గాని, రిక్షాలుగాని తిరగటం లేదు. ఎదురుగా కనిపించింది "నేడే ఆంధ్రా బంద్"

సంచి సర్దుకొని స్టేషన్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. ఎవరైనా నలుగురు బండి దిగి రాకపోలేరా? చెయ్యి చూపించుకోక పోతారా?

బీదవాని చేతిలో రూపాయి బిళ్ళలా

సూర్యుడు కరిగిపోయాడు. చీకటిలో నించి వచ్చిన చల్లగాలికి నిద్ర పట్టేసింది.

మెలకువ వచ్చి చూసేడు. బాగా పొద్దెక్కినట్లుంది. ఒక రోజు యింటికి వెళ్ళలేదనే నిజం గుర్తుకొచ్చింది. పాపం పార్వతి తన రాక కోసం చూసి చూసి నిద్రపోయి వుంటుంది. పార్వతి అతని భార్య.

నాలుగు డబ్బులు చేసుకోకుండా వెళితే ఎలా? మొహం తుడుచుకొని కూర్చున్నాడు.

రైళ్ళు వొచ్చాయి. పాసింజర్లు దిగారు, వెళ్ళారు గానీ ఏ ఒక్కరు కూడా తమ అదృష్టం తెలుసుకోవాలని అనుకోలేదు.

సూర్యుడు చాలా నీరసించాడు. జన సాంద్రత తగ్గిపోయింది.

ఖాళీ సంచీ చంకకు తగిలించుకుని నడిచేడు. ఈ రోజన్నా యింటికి వెళ్ళకపోతే ఎలా?

"ఏంటి గురూగారూ ఆడ కూర్చున్నారు?" తల ఎత్తి చూసేడు ఎదురుగా వున్నాడు దేవుడు. అతని ప్రక్కనే అతని చెరుకు రసం బండి. "బాగా అలసి పోయి నటున్నారు. త్రాగండి" ఒక గ్లాసు నిండా చెరుకు రసం పోసి యిచ్చాడు దేవుడు.

"ఎలా వుంది నీ వ్యాపారం?" గ్లాసందు కొంటూ అడిగాడు.

అంతా తమ దయేనండి బాబు నా చెయ్యి చూసి తమ రన్నారు గదండీ నాకూ మంచి రోజులొస్తాయని. ఇదిగో ఈ బండి వేస్తున్నాను. రోజుకో పదో పదిహేనో తెచ్చుకుంటున్నాను!

నవ్వు వచ్చింది తను చేప్పేది ఏమి వుంది. కాలం కలిసొచ్చింది. బాగు పడ్డాడు. ఎవరి చెయ్యి చూసినా తొందరలో అదృష్టం కలిసి వస్తుందని చెప్పటం అలవాటు. ఆ మాట విని సంతోషంతో ఏదో పడేస్తారని.

"ఏంటి గురూగారూ ఆలోచిస్తున్నారు? మీ బాబు గురించా? బాబుకేం భయం లేదు లెండి"

తుళ్ళిపడ్డాడు

"బాబుకేమయింది"?

"ఇంకేం భయం లేదు లెండి. డాక్టరుగారు చేప్పేపారు గదా? కొంచెం ఎక్కువగా విరోచనాలు అయేయి గదండీ. కళ్ళు తేలేసాడు"

ఒక్క వుదుటున లేచి నించున్నాడు. 'పద దేవుడు' అంటూ అడుగులు వేసాడు. కాళ్ళలోకి ఎక్కడ లేని బలం వచ్చింది.

దూరం నించే పార్వతి కనిపించింది. బాబుని వొళ్ళో పెట్టుకొని తన రాక కోసమే రోడ్డు వేపు చూస్తూ.

చాలీ చాలని నూనితో వెలుగుతున్న గుడ్డి దీపపు వెలుగులో ఆమె మొహం దీనంగా కనిపిస్తోంది.

భర్త రాక చూచి బాబు నెత్తుకొని నించుండి దీపపు వత్తిని ఎగదోపింది.

"బాబు కేమయింది? ఇప్పుడెలా వుంది?"

"ఇప్పుడు బానే వుంది లెండి". బాబుని చాప మీద పడుకోపెట్ట అతని చేతిలోని గొడుగు, సంచి అందుకుంది. సంచిలో చెయ్యి పెట్టి భర్త మొహంలోకి చూసింది. ఆమె మొహంలోని దైన్యం ఆ చీకటిలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

పార్వతి తెచ్చిన నీళ్ళతో మొహం, కాళ్ళు కడుగుకొని బాబు దగ్గరకెళ్ళి కూర్చున్నాడు.

దీపం దగ్గరకు జరిపి పార్వతి భర్త దగ్గరకు వచ్చి "ఏమండీ నేనొక మాటడగనా?" అంది.

"ఊఁ"

"ఏమండి మీరు చెయ్యి చూసి చెప్తే చెప్పినట్లు జరుగుతుందని అందరూ అంటున్నారు గదండీ? నా చెయ్యి చూసి చెప్పండి నాకెప్పుడు మంచి రోజులొస్తాయో?"

తన భార్య ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలా అని ఆలోచించే లోగా అప్పుడే వీచిన గాలి ఆ గుడ్డి దీపాన్ని మింగేసింది. ○

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి బహుమతి పొందిన కార్టూను




